క్లుప్తంగా

వైభవంగా సుదర్శన హోమం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రావణమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం తూర్పు వీధి రుక్మిణి సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి కోవెలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

స్కాలర్ షిప్ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): తపాలా శాఖ దీన దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్ షిప్ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ శ్రీకర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులు సెప్టెంబర్ 16లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థికి ఫిలాటెలి అకౌంట్ లేదా సంబంధిత స్కూల్ ఫిలాటెలి క్లబ్ మెంబర్ అయి ఉండాలని తెలిపారు. రెండు స్థాయిలోఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రతి త్రైమాసికం రూ.1500 చొప్పున ఏడాదికి రూ.6000 స్కాలర్ షిప్ నేరుగా విద్యార్థులకు సేవింగ్స్ ఖాతాలకు జమ చేస్తారని పేర్కొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నాగబాబు

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ ప్రాంతంలోని ఒక ఇంట్లో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఏలూరు రూరల్ ఇన్‌చార్జి, రూరల్ ఎస్సై నాగబాబు ఘటనా స్థలిలో మృతదేహాన్ని పరిశీలించారు. చెన్నై ప్రాంతానికి చెందిన టి.మునిబాబు (46) ఏలూరు నగరంలోని టానిక్ వైన్స్‌లో పనిచేస్తుంటాడు. అతను ఏలూరు మార్కెట్ యార్డ్ సమీపంలో ఒక ఇంట్లో అద్దెకు ఒంటరిగా ఉంటున్నాడు. మునిబాబు ఇంట్లో పడుకుని ఉండి మృతిచెందినట్టు గుర్తించారు. అనారోగ్య కారణాలతోనే మృతిచెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అనుమానస్పద మృతిగా కేసు విచారణ చేపడుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 256 మందికి పరీక్షలు నిర్వహించి పలువురికి శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. 32 మందికి కళ్లజోళ్లు మార్చారు. కంటి వైద్య నిపుణుడు డాక్టర్ రవికిరణ్, డాక్టర్ హేమలత ఈ శిబిరంలో సేవలందించారు. ఎప్పటికప్పుడు కంటి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటికి మరింత భద్రత కల్పించుకోవచ్చని వైద్యులు ఈ సందర్భంగా సూచించారు.

ఘనంగా శ్రీ పరమటమ్మ జాతర



కలశాలతో ఆలయానికి చేరుకున్న మహిళా భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట పాత నీళ్ల ట్యాంకు ఆవరణలో వేంచేసియున్న శ్రీ పరమటమ్మ (గువనాలమ్మ), పోతురాజు బాబు జాతర మహోత్సవాలు మంగళవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డప్పులు, వాయిద్యాలతో 58 మంది మహిళా భక్తులు పసుపు, కుంకుమ, వేపాకులతో కూడిన కళశాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయాన్ని అరటి చెట్లు, వేపాకు, మామిడి తోరణాలతో, వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. 41, 42, 43 డివిజన్ ప్రజలు పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారి మహోత్సవం గురువారం వరకు కొనసాగుతుందని, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

ఆ మార్గం.. దుర్గంధభరితం



మురుగునీటితో నిండిపోయిన డ్రెయినేజ్

ఏలూరు నగరంలో ప్రధాన కూడలి అయిన ఫైర్‌స్టేషన్ సెంటరులోని ఎన్‌టీఆర్ విగ్రహం నుంచి సెయింట్ థెరిస్సా కాన్వెంట్ వెనుక రోడ్డు మొత్తం వ్యర్థాలు, చెత్తతో నిండిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ రోడ్డు ప్రధాన హోటళ్ల వెనుక భాగంలో ఉంది. ఈ రోడ్డుపైనే వంట, వంటకు సంబంధించిన పనులు, వారు వాడిన చెత్తా చెదారం, మిగిలిన పదార్థాలను అక్కడే వేస్తున్నారు. దీనికితోడు డ్రెయినేజీ మూసుకుపోయింది. తీవ్ర దుర్గంధం రావడంతో ఆ మార్గంలో ప్రజలు నడవటం మానేశారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



ఆ రోడ్డులో ఎక్కడ చూసినా చెత్తా చెదారాలే



రోడ్డుపై వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



రోడ్డుపైనే వంట పనులు



రోడ్డుపై ఉన్న హోటళ్ల వ్యర్థాలు



హోటల్ నుంచి వస్తున్న మురికినీరు, రోడ్డుపైనే వేసిన వ్యర్థాలు

బార్లా తెరిచేశారు!

- సెప్టెంబర్ 1 నుంచి కొత్త బార్ పాలసీ
- రోజుకు 14 గంటలు మద్యం విక్రయాలు
- మద్యాన్ని ఏరులై పారించేలా కొత్త విధానం



ఏలూరు ఆర్ఆర్‌పేటలోని బార్ (ఫైల్)

ఏలూరు టౌన్: కూటమి సర్కారు మద్యాన్ని ఏరులైపారించేలా మరో నూతన బార్ పాలసీని తీసుకొస్తోంది. ప్రస్తుతం ఉన్న బార్లకు ఆగస్టు 31తో గడువు ముగియనుంది. ప్రభుత్వం తాజాగా కొత్త బార్ పాలసీకి తెరతీసింది. సెప్టెంబర్ 1 నుంచి కొత్తగా బార్లకు లైసెన్సులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ప్రైవేటు మద్యం షాపులు, బెల్టు షాపులతో నగరాలు, పట్టణాలు, గ్రామాలు తేడా లేకుండా మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఇక కొత్తగా బార్లు ఏర్పాటుతో మద్యం విక్రయాలు మరింత ఎక్కువగా జరిగేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది. ఎక్సైజ్ శాఖ అధికారులు కొత్తగా బార్లకు అనుమతులు మంజూరుకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 28న బార్ల ఏర్పాటుకు లాటరీ విధానంలో ఎంపిక చేసేందుకు సిద్ధపడుతున్నారు.

ఏలూరులో 11 బార్లు

కూటమి ప్రభుత్వ తాజా బార్ నూతన పాలసీలో ఏలూరు జిల్లాలో 18 బార్లకు అనుమతులు ఇవ్వనుంది. వీటిలో ఏలూరు నగరంలోనే 11 బార్లు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం ఏలూరు నగరంలో సుమారు 9 బార్లు ఉండగా మరో రెండు అదనంగా పెంచుతున్నారు. కొత్త పాలసీతో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా పెరిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే ఏలూరు నగరంలో 21 ప్రైవేటు మద్యం దుకాణాలు, బెల్టు షాపులతో మద్యం నిత్యం అందుబాటులో ఉండేలా చేస్తూ ప్రజలను మద్యం మత్తులో ముంచేస్తున్నారు. ఇక మరో 11 బార్లకు అనుమతులు ఇస్తే, ఏలూరు నగరంలో మద్యం ఏరులై పారుతుందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఏలూరు నగరంలో ఏడాదికి రూ.55 లక్షలు లైసెన్సు ఫీజుగా చెల్లించాల్సి ఉంది. పైగా ఆరు వాయిదాల్లో సొమ్ము చెల్లించేలా వెసులుబాటు కలిప్పించటంతో బార్ల లైసెన్సులకు పోటీ మరింత పెరుగుతుందనే అభిప్రాయం ఉంది.

రోజులో 14 గంటలు విక్రయం

నూతన మద్యం పాలసీలో కూటమి ప్రభుత్వం కొత్త విధానాలు తీసుకొచ్చింది. ఏలూరు నగరంలో కొత్తగా ఏర్పాటు చేసే బార్లు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచుకునేలా అనుమతులు ఇస్తారు. అంటే రోజులో 14 గంటల పాటు మద్యం తాగేవారికి బార్లు, బార్లా తెరిచే ఉండనున్నాయి. ప్రస్తుతం 11 గంటల వరకే అనుమతులు ఉంటే, రాత్రి 1 గంట వరకు పక్క నుంచి విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. అర్థరాత్రి 12 గంటల వరకు అనుమతి ఇస్తే, తెల్లవార్లూ బార్లా తెరిచేస్తారని మహిళలు వాపోతున్నారు. ఇక రూ.99 చీప్ లిక్కర్ బ్రాండ్ తప్ప, మిగిలిన అన్ని బ్రాండ్లు బార్లలో విక్రయాలు చేసుకునేలా వెసులుబాటు కల్పించారు.

మద్యం మత్తులో యువత



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వటంతో పట్టణాలు, గ్రామాల్లో మద్యం ఏరులైపారుతోంది. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో ఘోరంగా విఫలమైన సీఎం చంద్రబాబు యువతను మద్యానికి బానిసలుగా మార్చివేస్తుంది. మద్యం విక్రయాలు పెంచుకుని టీడీపీ నేతల జేబులు నింపుకుంటూ ప్రజలను మద్యం మత్తులో ఉంచుతూ, వారి సమస్యలను పక్కదారి పట్టించే కుట్రలు చేస్తున్నారు. మహిళలను సైతం టీడీపీ నేతలు దారుణంగా మోసం చేశారు. – **ఇనపనూరి కేదారేశ్వరి, ఏలూరు కార్పొరేటర్**

మద్యాంధ్ర ప్రదేశ్ చేస్తారా?



రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా కూటమి ప్రభుత్వం మార్చేస్తుంది. మద్యం షాపులన్నీ టీడీపీ నేతలకే కట్టబెట్టిన ప్రభుత్వం, మళ్లీ నూతన బార్ లైసెన్సు విధానంతో మద్యం విచ్చలవిడిగా అందుబాటులో ఉండేలా చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ఏలాగూ సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేకపోతున్నారు. ప్రజలు ఎన్నికల హామీలపై ప్రశ్నించకుండా మద్యం మత్తులో ఉండేలా ప్రోత్సహిస్తున్నారు. మద్యం నిత్యం అందుబాటులో ఉండడంతో కుటుంబాలు విచ్చిన్నం అవుతున్నాయి.

– **రావి సునీత, ఏలూరు వన్‌టౌన్**

ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించాలి



కెమెరా సృష్టికర్త డాగురేకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ది ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని స్థానిక ఎన్ఆర్‌పేటలోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. తొలుత కెమెరా సృష్టికర్త డాగురే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మట్లాడుతూ ఫొటోగ్రఫీ వృత్తి నిర్వహణకు, కెమెరాల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని, అర్ధరాత్రులు వేడుకల కవరేజ్ నిమిత్తం వెళ్లి తిరిగి వచ్చే సందర్భాల్లో పోలీసుల నుంచి ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మద్దాల శేఖర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్‌డీ ప్రసాద్, కోశాధికారి ఉజ్వల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల ఆధునికీకరణతోనే ముంపునకు పరిష్కారం



జెడ్పీటీసీ మండల సరస్వతి

దెందులూరు: డ్రెయిన్ల ఆధునికీకరణతోనే కొల్లేరు ముంపు సమస్య పరిష్కారమవుతుందని ఏలూరు జెడ్పీటీసీ మండల సరస్వతి, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మండల కొండలరావు అన్నారు. కొల్లేరుకు పైనుంచి వరద ముంపు హెచ్చరికలు జారీ అయిన సందర్భంగా మంగళవారం శ్రీపర్రులో వారు విలేకర్లతో మాట్లాడారు. కొల్లేరులో మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లు 67 ఉన్నట్టు చెప్పారు. ప్రతి వేసవిలో గుర్రపుడెక్క విధిగా తొలగించాలన్నారు. ఉప్పుటేరు వద్ద కొల్లేరు చివరి ప్రాంతం వద్ద 10 వేల క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు. విస్తారంగా వర్షాలు కురిస్తే, వరద వస్తే ఇన్‌ఫ్లో 50 వేల క్యూసెక్కులు ఉంటుందని, అవుట్ ఫ్లో కెపాసిటీ 10 నుంచి 12 వేల క్యూసెక్కులు మాత్రమే ఉన్న నేపథ్యంలో ఔట్‌ఫ్లో కెపాసిటీ పెంచితే కొల్లేరు ముంపు ఉండదని వివరించారు. ఏటా విధిగా ఈ పనులు చేయకపోతే కొల్లేరు ముంపు తప్పదని జెడ్పీటీసీ సరస్వతి అన్నారు.

'పీఎం వికసిత్ భారత్'తో అదనపు ప్రయోజనాలు



పీఎఫ్ కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన పథకంతో ఉద్యోగులకు, ఉద్యోగాలు కల్పించే యాజమాన్యాలకు అదనపు ప్రయోజనాలు అందుతాయని రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పథకంపై సోమవారం స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో అవగాహన కల్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన పథకం వల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు వస్తాయని, దేశంలో ఉద్యోగ కల్పన పెరిగి దేశ స్థూల దేశీయోత్పత్తిలో వృద్ధి మరింత మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో రీజనల్ పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్, సీఆర్ఆర్ కళాశాల కరస్పాండెంట్ కేఏస్ విష్ణుమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, శ్రీశ్రీ విద్యా సంస్థల చైర్మన్ ఎంబీఎస్ శర్మ, ఆంధ్రా షుగర్స్, అంబికా ఉత్పత్తుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

టి.నరసాపురం: పామాయిల్ గెలలు నరుకుతూ విద్యుత్ వైర్లు తగిలి చనిపోయిన దోమతోటి అంజయ్య కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు గూడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. బొర్రంపాలెంలో ఓ రైతు తోటలో గెలలు కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై పామాయిల్ గెలకోత కార్మికుడు అంజయ్య మృతి చెందాడన్నారు. గడచిన నెల రోజుల్లో టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, చింతలపూడిలో గెలలు కోస్తూ నలుగురు కార్మికులు చనిపోయారని తెలిపారు. వీరికి పామాయిల్ కర్మాగారాలు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ద్వారా పామాయిల్ గెలలు నరికే కార్మికులకు కనీసం రూ.25 లక్షల పరిహారం ఇప్పించాలని, విద్యుత్ శాఖ నుంచి మరో రూ.25 లక్షలు బాధిత కుటుంబాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలను కుంట బయో రిసోర్స్ సెంటర్ (బీఆర్సీ)లో యజమానులకు తొలిరోజు శిక్షణ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ వెంకటటేష్ మంగళవారం ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) ద్వారా జాతీయ ప్రకృతి పద్ధతి వ్యవసాయం (ఎన్ఎమ్ఎన్ఎఫ్) పథకం కింద ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ఎక్కువగా ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు.

సొసైటీల్లో ఎరువుల నిల్వల పరిశీలన



పురుగు మందును పరిశీలిస్తున్న అధికారులు

పోలవరం రూరల్: పోలవరంలోని ఐదు సొసైటీలకు ఎరువుల సరఫరా, సరుకు నిల్వల పరిస్థితిపై మంగళవారం తహసీల్దార్ ఆర్.సాయిరాజు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబులు తనిఖీ చేశారు. మంగళవారం సాక్షి పత్రికలో కృష్ణారావుపేట పీఏసీఎస్‌లో యూరియా కోసం పాట్లు అనే శీర్షికపై ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. సొసైటీల్లో యూరియా 25 మెట్రిక్ టన్నులు, నానో యూరియా 600 లీటర్లు, డీఏపీ 18 మెట్రిక్ టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 45 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 238 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కృష్ణారావుపేట సొసైటీలో రైతులకు నానో యూరియా ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. పంట నాట్లు వేసిన తదుపరి 25 రోజుల తరువాత పంట పూత సమయానికి ముందు వరకు నానో యూరియా వాడాలని సూచించారు. నానో యూరియా బాటిల్ ఒక బస్తా యూరియాతో సమానమని తెలిపారు. యూరియా నీటిలో కలిపి స్ప్రేయింగ్ చేయాలని, దీంతో మొక్క నేరుగా నత్రజని పోషకాన్ని మొక్క అంతా వ్యాప్తి చెందుతుందని వివరించారు. నానో యూరియా వాడటం వల్ల ఆవిరి రూపంలో నష్టపోయిన నత్రజనిని అరికట్టవచ్చన్నారు. మొక్క త్వరగా పెరుగుతుందని తెలిపారు. న్యూట్రియంట్ యూజ్ ఎఫియన్సీ ప్రకారం దాదాపు మనం వినియోగించే మందులు 80 శాతం వరకు మొక్క తీసుకుంటుందని అన్నారు. పంట దిగుబడి నాణ్యమైన ఉత్పత్తి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారావుపేట సొసైటీ అధ్యక్షుడు కొణతాల ప్రసాద్, డైరెక్టర్లు మిరియా చంటి, వెంకట్రావు, పాత పట్టిసీమ సొసైటీ అధ్యక్షుడు నులకాని రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

మార్మోగిన హనుమన్నామ స్మరణ

జంగారెడ్డిగూడెం: స్వయంభూః శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం మంగళవారం హనుమన్నామ స్మరణతో మార్మోగింది. తెల్లవారుఝామున అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు చేశారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	08
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	32